
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 28 జనవరి 2025



చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 17.0

నేడు బీఆర్ఎస్ రైతు మహాధర్నా

- హాజరు కానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు



మహాధర్నాకు నల్లగొండలో ఏర్పాటుచేసిన వేదిక

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వ్యవసాయరంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ పట్టణంలో మహాధర్నాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ మహాధర్నాకు మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తా వద్ద ఈ ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లు, స్వాగత తోరణాలు పట్టణమంతా ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై మాజీ మంత్రి గుంటకండ్ల

- మిగతా 6వ పేజీలో...

తొలి రోజు రూ. 111.72 కోట్లు



రైతు భరోసా జమ షురూ
82,436మంది రైతులకు లబ్ధి

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా నగదు జమను ప్రభుత్వం సోమవారం ప్రారంభించింది. మండలానికి ఒక గ్రామం చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. తొలి రోజు 82,436మంది రైతులకు రూ.111.72కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద ప్రభుత్వం ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు సీజన్లు చెల్లించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుభరోసాను సీజన్‌కు ఎకరాకు రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీఇవ్వగా, ఆ మేరకు ఈ పథకాన్ని ఈనెల 26న లాంచనంగా ప్రారంభించారు. అయితే ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం నగదు జమ ప్రారంభమైంది. నల్లగొండ మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ ప్రభుత్వం రైతుభరోసాను చెల్లించింది.

82,436మందికి రైతు భరోసా నగదు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోమవారం 82,436మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.111.72కోట్లు జమయ్యాయి. నల్లగొండ జిల్లాలో 33 మండలాల్లో 33 గ్రామాల్లో 35,508మంది రైతులకు రూ.46.93కోట్లు, సూర్యాపేట జిల్లాలోని 23...

- మిగతా 6వ పేజీలో...

నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాతబడిన అంగన్‌వాడీ, ప్రాథమిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. పాతబడిన అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే కొత్త భవనాల్లోకి మార్చాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఆమె అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. అనంతరం ఆమె జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి ప్రారంభించిన రైతు భరోసా పెండింగ్ దరఖాస్తులను నెలాఖరులోగా పరిశీలించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయితో పాటు, మండల గ్రామస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతంగా చేయాలని సూచించారు. పాతభవనాల్లో నిర్వహించే అంగన్‌వాడీ, పీహెచ్‌సీలతో ప్రమాదం పొంచి ఉందని, కొత్త భవనాల్లోకి మార్చాలన్నారు. అలాగే అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కాగా సోమవారం సుమారు 119 మంది తమ అర్జీలను కలెక్టర్‌తో పాటు, అధికారులకు సమర్పించారు. ఇదిలా ఉండగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు, అలాగే మార్చి 5 నుంచి మార్చి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమం అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది నిర్వహించే ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా ప్రతి ల్యాబ్‌లో తప్పనిసరిగా రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబ్‌లలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుందని, ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు సీసీ కెమెరాలను తప్పనిసరిగా యాజమాన్యాలు ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఆయా పరీక్షా కేంద్రాలను రద్దు చేస్తామన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 5 నుంచి నిర్వహించే ఇంటర్ వార్షిక పరీక్షలకు కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రునాయక్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పశుగణనకు సమగ్ర సమాచారం అందించండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వేశ్వరరావు

దేవరకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా చేపట్టిన 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా ఇంటిముందుకు వచ్చే వారికి సమగ్ర సమాచారం అందించాలని జిల్లా పశువైద్య శాఖఖ సహాయ సంచాలకులు బొడ్డు విశ్వేశ్వరరావు సూచించారు. దేవరకొండ పశువైద్యశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28వ తేదీతో పశుగణన పూర్తవుతున్నందున సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 163 మంది ఎన్యుమరేటర్లు దాదాపు 50 మంది సూపర్‌వైజర్లు పశుగణనలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. సర్వేలో ఆయా రైతులకు చెందిన అన్ని రకాల పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఇతర పక్షుల వివరాలు సేకరిస్తారని తెలిపారు. ప్రతీ ఐదేళ్లకోసారి జరిగే గణన ఆధారంగా పశుసంవర్ధక శాఖ మార్గదర్శకాలు రూపొందించుకుని ముందుకెళ్తుందన్నారు. పశుగణన ద్వారా ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తూ పథకాల రూపకల్పన చేస్తాయన్నారు. ఎంతో ముఖ్యమైన ఈ సర్వేను విజయవంతం చేసేందుకు రైతులు సమగ్ర సమాచారం ఇచ్చి తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో స్థానిక వైద్యాధికారులు డాక్టర్ నాగయ్య, ధనలక్ష్మి, రవి, యమున, శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మినీ భారత్‌గా మల్కాపురం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శివారులోని ఒకప్పటి పారిశ్రామిక ప్రాంతాలైన జీడిమెట్ల, బాలానగర్, చర్లపల్లి, నాచారం, ఉప్పల్‌లకు నగరం విస్తరించింది. ప్రజాజీవనం పెరిగి పరిశ్రమలు అక్కడ మనుగడ సాగించడం, కొత్తవి ఏర్పాటుచేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటుచేసింది. 550 ఎకరాల్లో 300 పరిశ్రమలు ఏర్పాటు లక్ష్యంగా నెలకొల్పిన ఈ పార్క్ దేశంలోనే అతిపెద్ద ఎంఎస్ఎంఇ హరిత పారిశ్రామిక పార్క్‌గా రూపుదిద్దుకుంటోంది. ఇక్కడి పరిశ్రమల్లో పనిచేసేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులతో దండుమల్కాపురం ప్రాంతం మినీభారత్‌ను తలపిస్తుంటుంది.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్)






- పరిశ్రమల పల్లెగా నెలవు
- దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్
- ఒకే పల్లెలో వందలాది పరిశ్రమలు, పెద్దసంఖ్యలో ఉపాధి
- 100 ఎకరాల్లో టౌన్‌షిప్ ఏర్పాటుకు సన్నాహాలు

చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామం పరిశ్రమలకు నెలవుగా మారింది. ఒకనాడు కొండలు, గుట్టలు, రాళ్లరప్పలతో నిరుపయోగంగా ఉన్న ఇక్కడి భూముల్లో నేడు వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్రంలో లక్షలాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉండగా అందులో సగానికి తక్కువ శాతం పరిశ్రమలకు సొంత స్థలాలు ఉన్నాయి. అద్దె స్థలాల్లో పరిశ్రమలు కొనసాగలేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఈ అంశంలో తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రత్యేక చొరవ చూపింది. అప్పటి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి దండుమల్కాపురంలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయించింది.

పరిశ్రమల ఏర్పాటు..

దండు మల్కాపురం గ్రామంలో మొత్తం 11,527 ఎకరాల భూమి ఉంది. దానికి తోడు ప్రభుత్వ, అసైన్డ్ భూములు కూడా ఎక్కువగా ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. దీంతో ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా నిర్మించిన ఈ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఇండస్ట్రియల్ పార్క్‌ను 2019 నవంబరు 1న నాటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అయితే పూర్తిస్థాయిలో కాలుష్య రహిత పరిశ్రమలకే ఈ పార్క్‌లో కేటాయింపులు చేస్తున్నారు. 550 ఎకరాలు కేటాయించిన ఈ పారిశ్రామిక పార్క్‌లో దశలవారీగా 300 పరిశ్రమలు నెలకొల్పనున్నారు. ఇప్పటికే 175 పైగా పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయి. 100కు పైగా పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. రెండు శాతం పరిశ్రమలు ఇంకా నిర్మాణాలను మొదలుపెట్టలేదు. పనులు మొదలుపెట్టని పరిశ్రమ యజమానులకు నోటీసులు కూడా పంపించారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు మరింత స్థలం కావాలని పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రభుత్వానికి విన్నవించింది. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే మరికొంతమంది పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు స్థలం మంజూరు చేసే అవకాశం ఉంది. పరిశ్రమలు ప్రారంభించిన, నిర్మాణంలో ఉన్న వాటిలో ఇప్పటికే పెద్దసంఖ్యలో కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈపారిశ్రామిక పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు లభించడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని పారిశ్రామికవేత్తలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో అన్నిరకాల పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజనీరింగ్, ప్యాకింగ్ ప్రింటింగ్, టైల్స్ ఫార్ములేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, రైస్ హబ్, బొమ్మల పార్క్‌లువంటి కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అంతేకాకుండా జాతీయరహదారికి ఆనుకుని రూ.2,800 కోట్ల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెర్మినల్ నిర్మిస్తోంది. అంతేకాకుండా రూ.1500 కోట్ల వ్యయంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నిర్మాణ..

- మిగతా 6వ పేజీలో...

యువత కోసమే 'మిషన్ పరివర్తన'



క్రీడాపోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మిషన్ పరివర్తన్ - యువతేజం కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆసక్తి కలిగిన యువతకు కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. విజేతలైన జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన గ్రామీణ యువత జట్ల క్రీడాకారుల జాబితాను తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిబ్రవరి 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ మండల స్థాయిలో కబడ్డి పోటీలు ఉంటాయన్నారు. అక్కడ గెలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.2,500, మూడో బహుమతి రూ.1,500 అందజేస్తారన్నరు. అదేవిధంగా మండలస్థాయిలో గెలుపొందిన జట్లకు ఫిబ్రవరి 10 నుంచి 16వ తేదీ వరకూ డివిజన్, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. డివిజన్ స్థాయిలో గెలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతిగా రూ.2500 అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలిచిన ప్రథమ విజేతకు రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలను అందజేస్తామని ప్రకటించారు. కబడ్డీపై మక్కువ ఉన్న క్రీడాకారులు విధిగా ప్రాతినిధ్యం వహించి తమ క్రీడా ప్రావీణ్యాలను ప్రదర్శించాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

నల్లగొండ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సంబంధిత అవసరాలుండే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన 30 మంది బాధితుల సమస్యలను విని వారి అర్జీలను స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. పూర్తి వివరాలను సమర్పించాలని ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ బాధితుల అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. అర్జీదారులకు నమ్మకం, భరోసా కలిగించాలన్నారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, చర్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటుకు కృషి

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనలో మోత్కూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం వీడ్కోలు సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, అమ్మనబోలు, వేములకొండ మండలాలుగా ఏర్పాటయ్యే అవకాశముందన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం)తో పాటు సమీపంలోని ఒకటి రెండు మండలాలను కలిపి మోత్కూరును నియోజకవర్గం చేయాలని ప్రభుత్వం, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నుంచి యాసంగికి బిక్కేరు వాగులోకి నీటి విడుదల చేయించానని తెలిపారు.

సాగర్ బుద్ధవనం అద్భుతం



నాగార్జునకొండ మ్యూజియంలో నాగ్‌పూర్ బౌద్ధులు

నాగార్జునసాగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం అద్భుతంగా ఉందని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన బౌద్ధులు అన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం వారు సందర్శించారు. మొదటగా జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ లాంచీలో చేరుకున్నారు. అక్కడ మ్యూజియం, బౌద్ధ మత స్తూపాలను, నమూనాలను, సింహళీయం, అశ్వమేథ యాగశాలలను తిలకించారు. అనంతరం బుద్ధవనానికి చేరుకొని బుద్ధవనంలో జాతక, స్తూప, చరిత, ధ్యాన వనం, బుద్ధుని పాదాలు, మహాస్తూపాలను సందర్శించారు. మహారాష్ట్రకు చెందిన రాజా టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో తెలంగాణలోని బౌద్ధ మత క్షేత్రాలను, ప్రాంతాలను సందర్శిస్తున్నట్లు వారు తెలిపారు. వారికి పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జున కొండ విశేషాలను వివరించారు.

వ్యక్తి నుంచి రూ.50వేలు అపహరణ

నార్కట్‌పల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో ఉన్న ఖాతాదారుడి జేబు నుంచి నగదును ఓ బాలుడు తస్కరించాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో సోమవారం జరిగింది. మండలంలోని నెమ్మాని గ్రామానికి చెందిన కర్నాటి వెంకన్న తన స్నేహితుడికి యూపీఐ ద్వారా రూ.50,100లను పంపాల్సి ఉంది. రూ.200, రూ.500ల నోట్లను దాచిన కవరును తన ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు. నార్కట్‌పల్లిలోని ఎస్‌బీఐలో ఉన్న తన ఖాతాలో జమ చేసేందుకు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వెళ్లాడు. తనతో పాటు వచ్చిన స్నేహితునికి బ్యాంకు మేనేజర్‌తో పని ఉండటంతో మాట్లాడేందుకు ఇద్దరూ కలిసి మేనేజర్ చాంబర్‌లోకి వెళ్లారు. పది నిమిషాల తర్వాత చాంబర్ నుంచి బయటకు వచ్చి నగదును బ్యాంకులో జమ చేసేందుకు ప్యాంట్ జేబులో చేయిపెట్టగా కవరు కన్పించలేదు. దీంతో సీసీపుటేజీని పరిశీలించగా బ్యాంక్ మేనేజర్‌తో చాంబర్‌లో మాట్లాడుతున్న సమయంలో సుమారు 13ఏళ్ల వయసున్న బాలుడు వీరి మధ్య నిలుచుని వెంకన్న జేబులో నగదు ఉన్న కవరును తస్కరించి నల్లగొండ క్రాస్‌రోడ్ వైపు పరారైనట్లు దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చోరీ ఉదంతంపై ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి సీసీ పుటేజీని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ధ్రువీకరించలేదు.

ఆలయంలో వెండి కిరీటం చోరీ



మారమ్మ దేవాలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆత్మకూరు(ఎం) జనవరి 27: (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మండలంలోని మొర్పిరాల గ్రామంలోని దేవాలయంలో గుర్తుతెలియని దొంగలు ఆదివారం రాత్రి 80తులాల అమ్మవారి వెండి కిరీటాన్ని ఎత్తుకెళ్లారు. హుండీలో సుమారు రూ.20వేల నగదును అపహరించారు. దేవాలయ ధర్మకర్త దేవి ఉపాసకులు పాలెం మనోహర్‌శర్మ తెలిపిన వివరాల ప్రకారం... రోజు దేవాలయాన్ని శుభ్రం చేసే మహిళ రోజు మాదిరిగానే ఆదివారం శుభ్రం చేసి దీపం వెలిగించి తాళం వేసి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం వచ్చిన ఆ మహిళ దేవాలయానికి వేసిన తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి గ్రామస్థులకు విషయం చెప్పింది. సమాచారం తెలుసుకున్న హైదరాబాద్‌లో ఉండే గుడి ధర్మకర్త మనోహర్‌శర్మ దేవాలయానికి వచ్చి పరిశీలించారు. 80తులాల వెండి కిరీటం, అమ్మవారి బంగారపు పుస్తెలు, రూ.20వేల నగదు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్‌ఐ కృష్ణయ్య, క్లూస్ టీం సభ్యులు దేవాలయాన్ని పరిశీలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఎద్దు మృతి



బావి నుంచి ఎద్దు కళేబరాన్ని తీస్తున్న గ్రామస్థులు

తిరుమలగిరి(సాగర్), జనవరి 27(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎల్లాపురం తండా పరిధిలో సోమవారం బావిలో పడి ఎద్దు మృతి చెందింది. బాధిత రైతు కుర్ర గణేష్ తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయంతో పాటు బండ లాగుడు పందేల్లో పాల్గొనే ఎద్దు మేత కోసం పొలం సమీపంలోని బావి వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న విద్యుత్ వైర్లు కాళ్లకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న బావిలో పడిపోయినట్లు రైతు తెలిపారు. స్థానికుల సహాయంతో ఎద్దును బావి నుంచి బయటకు తీసినట్లు తెలిపారు. సుమారు రూ.1.40లక్షలు పెట్టి ఎద్దును ఇటీవలే కొనుగోలు చేశానని బాధిత రైతు వాపోయడు. ప్రభుత్వం ఆర్థింగా సహాయం చేసి ఆదుకోవాలని రైతు కోరారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

చింతపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడ్డ ఇటుక బట్టీ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన తురుపాన్ చింద(35) చింతపల్లి మండలంలోని కుర్మపల్లి గ్రామశివారులోని ఇటుకబట్టీలో కూలీగా పనిచేస్తూ జీవితం సాగిస్తున్నాడు. ఈ నెల 25న ఇటుక బట్టీలో వరి పొట్టును నిచ్చెన సహాయంతో పోస్తున్నాడు. ప్రమాదవాశత్తు కాలు జారీ కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న కార్మికులు వడ్యా శంకర్, ధనిరామ్ అతడిని చికిత్స నిమిత్తం మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. తురపాన్ సోదరుడు జటు చిందా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి..

బీబీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్‌లోని ఇందిరమ్మకాలనీకి చెందిన పొట్ట కుమార్, జయమ్మ దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన వారికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూశారు. తులంన్నర బంగారం, 40తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.15వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చినట్లు తెలిపారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు కుమార్ తెలిపారు.

దొంగ అరెస్ట్, రిమాండ్

భువనగిరిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చోరీ చేసేందుకు వచ్చిన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన యాట రమేష్‌ను యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 25 రాత్రి భువనగిరి అర్బన్ కాలనీలో రమేష్ చోరీకి ప్రయత్నించాడు. కానీ స్థానికుల అప్రమత్తతతో పారిపోయాడు. దీంతో అదే కాలనీకి చెందిన సాయికుమార్ అదే రోజు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం భువనగిరి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అర్బన్‌కాలనీలో దొంగతనానికి ప్రయత్నించిన యాట రమేష్‌గా తేలింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దిరాల, కోదాడ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా సూర్యాపేట జిల్లా మద్దిరాల, కోదాడ మండలాల్లో ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మద్దిరాల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి బయ్యయ్య ట్రాక్టర్‌తో పాలేరు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా పోలీసలు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వీరన్న హెచ్చరించారు. ఏపీలోని హిందుపల్లి నుంచి కూచిపూడి మీదుగా కోదాడకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను మండలంలోని యర్రవరం గ్రామ శివారులో సోమవారం పట్టుకున్నారు. డ్రైవర్ షేక్ జానీ, ఓనర్‌లపై కేసు నమోదు చేసినట్లు కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కార్పొరేట్ కళాశాల.. అడ్మిషన్ వల

'హలో.. మీ పాప, బాబు పదో తరగతి అయిపోయింది. ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు. మాది కార్పొరేట్ కళాశాల ఐఐటీ మొయిన్స్, జేఈఈలో ఏసీ, నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లు ఉన్నాయి. ఇప్పుడు జాయిన్ చేయిస్తే ఫీజులో రాయితీ ఇస్తాం' అంటూ ఇంటర్ కార్పొరేట్ కళాశాలల ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



రెండు నెలల్లో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు రాయనున్నారు. ఫీజులో రాయితీ పేరిట కార్పొరేట్ ఇంటర్ కళాశాలలు ఇప్పుడే అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఇం టర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు కార్పొరేట్ కళాశాలలు అప్పుడే తెరలేపాయి. పదో తరగతి పరీక్షలు ముగిసి ఇంటర్ ప్రవేశాల ప్రారంభం మధ్య సు మారు రెండు నెలల గడువు ఉంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అధికారికంగా సుమారు నాలుగునెలల వ్యవధి ఉంది. కానీ పిల్లల ఉజ్వల భ విష్యత్తును ఆశిస్తున్న తల్లిదండ్రుల బలహీనతను, ముందస్తుగా అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో రాయితీ, మాసంస్థల్లోనే టాప్ క్యాంపస్‌లలో ప్రవేశాలంటూ ఆయా కళాశాలల పీఆర్‌వోలు, మధ్యవర్తులు 10వ తరగతి పిల్లల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరిస్తున్నారు. దీంతో పలువురు రిజిస్ట్రేసన్ పేరిట రూ.10 వేలు చెల్లిస్తుండగా ఆర్థిక స్థోమత ఉన్న కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఏకంగా ట్యూషన్ ఫీజు మొత్తాన్ని చెల్లిస్తున్నారు.

జిల్లా	విద్యార్థులు
నల్లగొండ	19,254
సూర్యాపేట	11,912
యాదాద్రి	6,682
మొత్తం	44,530

హైదరాబాద్ కార్పొరేట్ కళాశాలల అడ్మిషన్ల వేట

తమ పిల్లలు త్వరగా అధిక వేతనాలతో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని తల్లిదండ్రులు కోరుకోవడం సహజమే. విద్యార్థి భవిష్యత్తును నిర్ధేషించడంలో ఇంటర్మీడియేట్‌ది కీలకం. ఇంటర్‌లో ఎంచుకునే కోర్సులపైనే భవిష్యత్తులో స్థిరపడే రంగం సుమారుగా ఖరారు అవుతుంది. డిమాండ్‌తో కూడిన వృత్తి విద్యా కోర్సులుగా ఐఐటీ, ఎన్‌ఐటీ, జేఈఈ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఎంసెట్ ఉన్నాయి. వీటన్నిటిలో ప్రవేశాలకు ఇంటర్ తర్వాత ప్రవేశ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఇదే అదనుగా భవిష్యత్తులో విద్యార్థులు చేరే కోర్సులకు ఇంటర్ ప్రథమ సంవత్సరం మొదటి రోజునుంచే కోచింగ్ ప్రారంభి స్తామని, ఆయా కోర్సు ల్లో తమ సంస్థ కళాశాలల విద్యార్థులు సాధించిన విజయాల కరపత్రాలను చూపుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాలకు చెందిన కార్పొరేట్ కళాశాలల ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులతో అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. అప్పటికప్పుడు ఒప్పు కోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ విసిగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇంటర్మీడియట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కావల్సి ఉంటుంది. చదివే కోర్సులు, చేరే కళాశాలలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వేచ్ఛ, హక్కులు ఉంటాయి. కార్పొరేట్ కళాశాలల ముందస్తు అడ్మిషన్లు నియంత్రించడంలో అధికారులు అలసత్వం చూపుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

పాఠశాలలనుంచే ఫోన్ నెంబర్ల సేకరణ

పదో తరగతి చదువుతున్న పిల్లల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను కార్పొరేట్ కళాశాలల పీఆర్‌వోలు ఆయా పాఠశాలల నుంచే సేకరిస్తున్నారు. ఇందుకు యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు తృణమో పణమో చెల్లించుకుంటున్నట్లు ప్రచారంలో ఉంది. మెరిట్ విద్యార్థులు, ఆర్థిక స్థోమత కలిగిన తల్లిదండ్రుల వివరాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 44,530 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇంటర్ ప్రవేశాలపై ముందస్తు ప్రచారం చేసినా, ప్రవేశాలు స్వీకరించిన చర్యలు తీసుకుంటాం. కార్పొరేట్ కళాశాలల మాయాజాలంలో తల్లిదండ్రులు పడొ ద్దు. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధ న, మౌలిక వసతులు లభిస్తాయి. ప్రభుత్వ కళాశాల లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిర పడుతున్నారనే వాస్తవాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి.

- రమణి, యాదాద్రి జిల్లా ఇంటర్ నోడల్ అధికారి.

ఫోన్ నెంబర్లు ఇవ్వొద్దు



పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు, వివరాలు పాఠశాలల యాజమాన్యాలు కార్పొరేట్ కళాశాలలకు ఇవ్వొద్దు. ఇంటర్మీడియట్‌లో చేరికలపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి చేయొద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై స్వచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాలి.

- సత్యనారాయణ, యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో.

నిలిపిఉంచిన లారీలే టార్గెట్

● లారీలు అపహరిస్తున్న ముఠా అరెస్టు ● రెండు లారీలు, రెండు ఎర్టిగా కార్లు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ రోజులపాటు నిలిపిఉంచిన లారీలను అపహరించి ఏపీ రాష్ట్రం విజయవాడలో విక్రయిస్తున్న నలుగురు ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండకు చెందిన పాలడుగు రాజు తన లారీని తిప్పర్తి పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్ యార్డులో నిలిపిఉంచాడు. గత సంవత్సరం డిసెంబరు 24వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ లారీని అపహరించినట్లు బాధితుడు మరుసటి రోజు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తిప్పర్తి సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. నెంబర్ ప్లేట్లు లేని రెండు ఎర్టిగా కార్లు నకిరేకల్ వైపునకు వెళ్తుండగా అందులోని వ్యక్తులు పోలీసులకు అనుమానాస్పదంగా కన్పించారు. కార్లలో ఉన్న కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన మెండె వెంకన్న, గుజ్జేటి శ్రీనివాస్, కొరుపుల సాయి కుమార్, కొత్తగూడెం జిల్లాకు చెందిన అరికె రవిలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నలుగురితో పాటు కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన కొండ సురేష్‌కు కూడా ఈ ఘటనతో భాగస్వామ్యం ఉన్నట్లు చెప్పారు. తామంతా లారీడ్రైవర్లుగా పనిచేస్తూ, అధికంగా డబ్బు సంపాదించేందుకు లారీలను అపహరిస్తున్నట్లు అంగీకరించారు. నెంబరు లేని కారులో రాత్రి సమయాల్లో గ్రామాల్లో తిరుగుతూ చీకటి ప్రదేశాల్లో నిలిపి ఉంచిన లారీలను గుర్తించి వాటిని అక్కడినుంచి తీసుకువెళ్లి ఏపీ రాష్ట్రం విజయవాడలోని ఆటోనగర్‌లో విక్రయించేవారని తెలిపారు. ఈ నెల 5వ తేదీన చిట్యాల మండలం పెద్దకాపర్తి పెట్రోల్ బంకులో పార్క్ చేసిన మరో లారీని కూడా ఎత్తుకెళ్లారు. వీటిని విజయవాడ ఆటోనగర్‌కు చెందిన షేక్ హబీబ్ రహమాన్‌కు విక్రయించారు. ఇనుపాములకు చెందిన కొండ సురేష్, లారీని కొనుగోలు చేసిన షేక్ హబీబ్ రహమాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. లారీ అపహరణ కేసులను ఛేదించిన శాలిగౌరారం సీఐ కె. కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్‌ఐ బి. సాయి ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, రామును ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

నేడు బీఆర్ఎస్ రైతు మహాధర్నా

(5వ పేజీ తరువాయి)



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనాయకులతో ఇప్పటికే నల్లగొండలో సమావేశం నిర్వహించి చర్చించారు. మహాధర్నాకు ఉమ్మడి జిల్లా నుంచి రైతులను తరలించనున్నారు. ప్రధానంగా రైతుభరోసా, రుణమాఫీ, కౌలురైతులకు రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయపథకం, దొడ్డురకాలకూ బోనస్ ఇవ్వాలనే డిమాండ్లను ఈ మహాధర్నా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. అదేవిధంగా కృష్ణా జలాల్లో వాటా, కాళేశ్వరం ద్వారా నీరివ్వడం లేదనే అంశాలను ప్రస్తావించనున్నారు. ఈ ధర్నాను ఈ నెల 12న నిర్వహించాలని అనుకున్నా, సంక్రాంతి పండుగ నేపథ్యంలో 21వ తేదీకి వాయిదా వేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామసభల నేపథ్యంలో ఈ ధర్నాకు పోలీసులు అనుమతులు ఇవ్వకపోవడంతో మళ్లీ వాయిదా పడింది. దీంతో ధర్నాకు అనుమతివ్వాలని బీఆర్ఎస్ నాయకులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈనెల 28న ధర్నా నిర్వహించేందుకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇవ్వగా, తాజాగా మంగళవారం ధర్నా నిర్వహించేందుకు పార్టీ నేతలు సిద్ధమయ్యారు. 22వ తేదీన జరిగిన ఫ్లెక్సీ వివాదం నేపథ్యంలో ఘర్షణ వాతావరణం కొనసాగడంతో అందరి దృష్టి ఈ మహాధర్నాపై పడింది.

ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ మహాధర్నా నిర్వహించే గడియారం చౌరస్తా వద్ద ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, పార్టీ నేత ఒంటెద్దు నరసింహారెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. మహాధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు ఇతర ముఖ్యనేతలు వస్తుండడంతో పాటు మధ్యాహ్నానికే ధర్నా ముగించాల్సి ఉన్నందున 10.30కే అందరూ ధర్నా స్థలికి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, యాదయ్య, జమాల్‌ఖాద్రి ఉన్నారు.

తొలి రోజు రూ.111.72కోట్లు

(5వ పేజీ తరువాయి)

మండలాల్లో 23గ్రామాల్లోని 29,352మంది రైతులఖాతాల్లో రూ.37.84 కోట్లు జమయ్యాయి. యాదాద్రి జిల్లాలో 17మండలాల్లోని 17 గ్రామాల్లో 17,576మంది రైతుల ఖాతాల్లో రూ.26.95కోట్లు జమచేశారు. తొలిరోజు రైతుల ఖాతాల్లో నగదు జమ కాగా, మంగళవారం నుంచి మిగతా రైతుల ఖాతాల్లో డబ్బుపడుతుందో లేదో తెలియదు. ఇప్పటివరకు మిగతా రైతులకు రైతుభరోసాపై అధికారుల వద్ద సమాచారం లేదని తెలిసింది.

ప్రతి ఒక్కరికీ రైతు భరోసా : శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

ప్రతీ ఒక్క రైతుకు రైతుభరోసా నిధులు మంజూరు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అర్హులైన ప్రతీ రైతు వివరాలు పంపించాం.సోమవారం ఆయా గ్రామాల్లో నూటికి నూరుశాతం రైతుల ఖాతాల్లో నిధులు జమయ్యాయి. రైతులందరికీ రైతు భరోసా నిధులు జమవుతాయి.

ఉమ్మడి జిల్లాలో సోమవారం రైతు భరోసా జమ ఇలా..

జిల్లా	మండలాలు	లబ్ధిపొందిన గ్రామాలు	లబ్ధిపొందిన రైతులు	జమైన నగదు
నల్లగొండ	33	33	35,508	రూ.46.93కోట్లు
సూర్యాపేట	23	23	29,352	రూ.37.84కోట్లు
యాదాద్రి	17	17	17,576	రూ.26.95కోట్లు
మొత్తం	73	73	82,436	రూ.111.72కోట్లు

రైతు ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, పక్కన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించే రైతు ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు కోరారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించే ఈ ధర్నాలో జిల్లా వ్యాప్తంగా రైతులు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ కె.ప్రదీప్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, బంటు మహేందర్, కె. సైదిరెడ్డి, టి.వెంకన్నగౌడ్, జె. పాపయ్య పాల్గొన్నారు.

సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నల్లగొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్‌టీయూ నల్లగొండ అర్బన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీగల శంకరయ్య, వీరమళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భోజన విరామ సమయంలో నల్లగొండ జిల్లా నల్లగొండ ఇన్‌చార్జి తహసీల్దార్ తబితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాదె వెంకట్‌రెడ్డి, బూరుగు లింగయ్య, వెంకటరమణ, అంజద్, బద్రీనాద్, సైదయ్య, క్రాంతికుమార్, రాంబాబు, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, భాస్కర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీభారత్‌గా మల్కాపురం

(5వ పేజీ తరువాయి)

పనులను ప్రారంభించింది. ఈ ప్రాంతం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు అతి సమీపంలో ఉండడంతో మరిన్ని పరిశ్రమలు కూడా ఇక్కడ ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

కార్మికులకు నిలయం

దండు మల్కాపురం గ్రామంలో గతంలోనే వివిధ రకాల రసాయన ఇతర పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. తాజాగా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో వందలాది పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఈ పరిశ్రమల్లో పనిచేసేందుకు దేశంలోని ఒడిషా, చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వస్తున్నారు. ఒక్కో పరిశ్రమలో పదుల నుంచి వందల సంఖ్యలో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం పరిశ్రమలకు వెళ్లే సమయం, సాయంత్రం పరిశ్రమల నుంచి తిరిగి వచ్చే వేళలో ఈ ప్రాంతమంతా కార్మికులతో సందడిగా మారుతుంటుంది. రూ.20 వేల నుంచి రూ.40వేల వేతనంతో పనిచేసే కార్మికులు అదే ప్రాంతంలో నివసిస్తుండగా, ఆ పైన వేతనంతో పనిచేసే కార్మికులు హైదరాబాద్‌ని శివారు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ నివాస ఉండడంతో ఈ ప్రాంతమంతా మినీ ఇండియాగా కనిపిస్తుంటుంది.

అందరి చూపు మల్కాపురం వైపు

దండు మల్కాపురం గ్రామం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ ఉండడంతో అందరి చూపు ఇటువైపే పడింది. ఈ ప్రాంతంలో అన్నివర్గాల ప్రజలు విస్తరించి ఉండడంతో నివాస ప్రాంతాలకు కూడా భారీగా డిమాండ్ ఉంది. ఇక్కడ అద్దె ఇల్లు కూడా దొరకడం కష్టం. ఇక్కడి ప్రజల అవసరాలకు తగ్గట్టు కిరాణం దుకాణాలు, హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. అంతేకాకుండా వాణిజ్యపరమైన దుకాణ సముదాయాలు సైతం ఏర్పాటవుతున్నాయి. దీంతో వ్యాపారస్తులు సైతం ఈ ప్రాంతాల్లో తమ దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దానికి తోడు ఈ ప్రాంతం పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారడం హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో పెట్టుబడిదారులు సైతం ముందు చూపుగా ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెడుతూ ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు.



దండు మల్కాపురం ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు

కార్మికులకు నివాస సముదాయాలు

ఇండస్ట్రియల్ పార్క్‌లో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులు నివాసం ఉండేందుకు 100 ఎకరాల్లో టౌన్ షిప్‌ను నిర్మించడానికి తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రత్యేక చొరవ చూపుతోంది. పరిశ్రమలలో పని చేసే కార్మికులకు పరిశ్రమల పక్కనే నివాస సముదాయం కల్పిస్తే ఉపయోగంగా ఉంటుందని భావిస్తోంది. ఇందుకోసం సమాఖ్య ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. భూమి కేటాయింపునకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పరిశ్రమలకు పనికిరాని భూములు కేటాయించిన దానిని అభివృద్ధి చేసి టౌన్‌షిప్‌గా మారుస్తామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి టౌన్‌షిప్ ఏర్పాటు ప్రతిపాదనను సీఎంకు విన్నవించేందుకు వారు సన్నద్ధమవుతున్నారు.

100 ఎకరాల్లో టౌన్‌షిప్ ఏర్పాటుకు ప్రతిపాదనలు



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పనిచేస్తున్న కార్మికుల కోసం టౌన్ షిప్ ఏర్పాటుకు 100 ఎకరాల భూమిని కేటాయించాలని నివేదిక అందజేశాం. పార్క్‌లో 300 పరిశ్రమలు ఏర్పాటులక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటికే 175 పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించాయి. 100కు పైగా పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికీ పనులు మొదలుపెట్టని ఒకటీ రెండు శాతం పరిశ్రమలకు నోటీసులు అందజేశాం. సులువుగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు పరిశ్రమల ప్రధాన రహదారి వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి విన్నవించాం. వచ్చే ఏడాది నాటికి ఇండస్ట్రియల్ పార్క్‌లో పూర్తిస్థాయిలో పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించే విధంగా పనిచేస్తున్నాం.

● ఎం. గోపాల్‌రావు, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రధాన కార్యదర్శి

పరిశ్రమల ఏర్పాటుకు మంచి ప్రదేశం



పరిశ్రమల ఏర్పాటుకు దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ మంచి ప్రదేశం. ఇక్కడ అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమ ఏర్పాటు చేయదలిస్తే అనుమతులు కూడా త్వరగా వస్తున్నాయి. మేము కోర్ క్రస్టిక్ పరిశ్రమను ఏర్పాటుచేశాం. సుమారు రెండేళ్ల నుంచి ఉత్పత్తులు కూడా ప్రారంభించాం. వ్యాపారం జరుగుతోంది. ఎలాంటి కాలుష్యం లేని పరిశ్రమలు ఇందులో ఏర్పాటవుతున్నాయి. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చాలామంది ముందుకు వస్తున్నారు.

● మేరెడ్డి ప్రదీప్‌రెడ్డి, పరిశ్రమ యజమాని.

అద్దె భవనాలు..అరకొర వసతులు



తిరుమలగిరి (సాగర్)వ్యవసాయ మార్కెట్ యార్డు రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న పోలీస్‌స్టేషన్

ఆంధ్రజ్యోతి విజిట్

▸ అన్ని కొత్త మండలాల్లో పూర్తి స్థాయిలో లేని సిబ్బంది ▸ ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పరిపాలన సౌలభ్యం, ప్రజలకు పాలన మరింత చేరువ చేసేందుకు గత ప్రభుత్వం 2016 సంవత్సరంలో కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. మండలాలు ఏర్పడి తొమ్మిదేళ్లు కావొస్తున్నా దాదాపుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు దాదాపుగా అద్దె భవనాల్లో అర కొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. సిబ్బంది కొరతతో అన్ని కార్యాలయాల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

తిరుమలగిరి(సాగర్) ఆంధ్రజ్యోతి : మండలంలో తహసీల్దార్ కార్యా లయం స్థానిక ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనానికి అద్దె నెల కు రూ.9వేలు ఉండగా రెండేళ్లుగా సుమారు రూ.2.16లక్షలు బకాయి ఉందని బాధిత భవన యజమాని వాపోయారు. పోలీస్ స్టేషన్‌ను స్థానిక వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డ్‌కు చెందిన రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. దీంతో వేసవికాలంలో వేడికి తాళలేక అందులో పనిచేసే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే వర్షాకాలంలో వ కురుస్తుందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని పాత సింగిల్ విండో భవనంలో రెండు గదుల్లో నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. ఐకేపీ కారా లయాన్ని రేకుల షెడ్డు అద్దె భవనంలో నిర్వ హిస్తున్న పరిస్థితి నెలకొంది.

అనంతగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని మండల కా ర్యాలయా లు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా వసతులు అధికారులు లేక పోవడంతో ప్రజలు నానా అవస్థ లు పడుతున్నారు. అనంతగిరి, తహసీల్దార్ కా ర్యాలయం, ప్రభు త్వ హైస్కూల్‌లో నిర్వహిస్తుండ గా ఎంపీడీవో కార్యాలయం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తు న్నారు. వ్యవసాయ కారాలయం, పోలీసుస్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. కాగా ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు శంక స్థాపన చేశారు. నాలుగు నెలలు కావొస్తున్నా ఇంతవరకు ఎటువంటి పనులు చేపట్ట లేదు. ఇక ఏడా ది నుంచి ఎంపీడీవో పోస్టు కూడా ఖాళీగా ఉంది. పోలీసుస్టేషన్, వ్యవ సాయ కార్యాలయాలు కూడా పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటుచేయలేదు. ఇంజనీరింగ్ విభాగం నీటిపారుదల, ఆర్అండ్‌బీ శాఖ అధికారుల సైతం ఇంకా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు.

కానరాని సౌకర్యాలు



ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ల ఊసేలేదు



అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం

పెద్దఅడిశర్లపల్లి (ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలంలో 11 గ్రామాలు ఉండగా 14,620 జనాభాతో ఉంది. తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా, ఇంతవరకు ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, పీఏసీఎస్ వంటి కార్యాలయాల ఊసే లేదు. పోలీస్ స్టేషన్ గతంలో ఉన్నా ఏర్పాటుకు అడుగు ముందుకు పడడంలేదు. ఏ పని కావాలన్నా మరల ఉమ్మడి మండలం పీఏపల్లికి పోవాల్సిందే. మండలం ఏర్పడక ముందు నుంచే ఎస్‌బీఐ బ్యాంక్, పోస్టాఫీస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాలయాలు ఉన్నాయి. మండలం ఏర్పడ్డాక ఒక్క తహ సీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో ఏర్పాటు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారు.

ఇన్‌చార్జులే దిక్కు..

మేళ్లచెర్వు(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంగా ఎంపీడీవో, తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అగ్రికల్చర్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు లేవు. ఈ ప్రాంతంలో మండల అధికారులు, విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపడం లేదు. దాంతో దాదాపు సగం శాఖలల్లో మేళ్లచెర్వు, మండల ఇన్‌చార్జిలతోని నిర్వహిస్తున్నారు. ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ శాశ్వత భవనాలకు శ్రీకారం చుట్టారు.

రెండో అంతస్థులో తహసీల్దార్ కార్యాలయం

మద్దిరాల, (ఆంధ్రజ్యోతి): మండలం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు పోలీస్, తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెలుగు కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఎమ్మార్సీ భవనంలో ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. గ్రంథాలయంలో పీహెచ్‌సీని నిర్వహిస్తున్నారు. మిగతా శాఖల కార్యాలయాలు ఇరుకు ఉన్న అద్దె భవనాలల్లో కార్యాలయాల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఇరుకుగా గదులు ఉండడంతో సమస్యల కోసం వచ్చిన ప్రజలు కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడు తున్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఎక్కడ అద్దె భవనం కింద అందుబాటులో లేక రెండో అంతస్తులో ఏర్పాటు చేయ డంతో వృద్ధులు, దివ్యాంగులు వెళ్లాలంటే అవస్థ పడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో కూర్చుద్దామంటే స్థలం వచ్చిన బాధితులు రోడ్డుపైనే కూర్చుంటున్నారు. తహసీల్దార్ కార్యా లయం కోసం యర్రంశెట్టి ఉపేందర్ రెండు ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. నిర్మాణ పనుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కార్యాలయం కోసం స్థలాన్ని జిల్లా వైద్యాధికారి రెవిన్యూ అధికారులతో కలిసి గుర్తిం చారు. పోలీ స్ స్టేషన్‌కు సైతం స్థలాన్ని కేటాయించారు. తహసీల్దార్ పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్నాయి.



అద్దె భవనంలో మద్దిరాల పోలీస్‌స్టేషన్

అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తాం



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల కోసం సర్వే నెం.250లో 12ఎకరాల భూమి ఉంది. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ కార్యాలయాల నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో కార్యాలయానికి ఎకరం భూమిని కేటాయించాం. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులను మొదలుపెడ్తాం.

-ఎస్.సురేష్ (తహసీల్దార్) మాడ్గులపల్లి

తాగు నీటి వసతి లేదు..



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తాగు నీటి వసతి లేదు. ప్రభుత్వ కార్యాల యాలకు వెళ్తే కూర్చోవడానికి కుర్చీలు లేక కిందనే కూర్చోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాలకు పర్మినెంట్ భవనాలు నిర్మించాలి.

- కుమార్‌యాదవ్ గోరెంట్ల, మద్దిరాల

సర్వ సభ్య సమావేశాలకూ ఇబ్బందులు

మాడ్గులపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీ డీవో, గ్రామ పంచాయతీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గతంలో నిర్మించి ఉన్న పశువైద్యశాల భవనంలోనే కొన్ని గదులను తహసీల్దార్ కార్యా లయానికి కేటాయించారు. దీంతో కార్యాలయాలకు నిత్యం పనుల కోసం వచ్చే ప్రజలకు కూర్చొనేందుకు కనీసం స్థలం లేక ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఎంపీడీవో కార్యా లయంలో సర్వసభ్య సమావేశాలు, ఇతర సదస్సుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రతినెలా సుమారుగా రూ.15వేలుకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. ఇలా ఏడాదికి రూ.1.80లక్షలు చెల్లిస్తుం డగా 8 ఏండ్లుగా అద్దె రూ.14.40 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. బాపనకుంట సమీపంలో 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఎంపీడీవో, తహసీల్దార్ పోలీస్ స్టేషన్, కేజీబీవీ నిర్మాణాల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అలాగే తహసీల్దార్ ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, వ్యవసాయశాఖ సిబ్బంది కొరత ఉండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.



అద్దెభవనంలో నడుస్తున్న మాడ్గులపల్లిలో తహసీల్దార్ కార్యాలయం

రాష్ట్ర స్థాయి అండర్- 17 క్రికెట్ టీమ్‌కు ఐశ్వర్య



పెద్దఅడిశర్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 క్రికెట్ టీమ్‌కు నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామానికి చెందిన మూడావత్ ఐశ్వర్య ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మంలో రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఆమెను ఎంపిక చేశారు. ఫిబ్రవరి 2 నుంచి హర్యానాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్-17 పోటీల్లో పాల్గొనున్నారు. దామరచర్ల టీటీడబ్ల్యూఆర్‌జేసీ లో చదువుతున్న దీంతో గ్రామస్థులు, మండల నాయకులు ఐశ్వర్యను అభినందించారు.


ఇంటర్ విద్యార్థి బలవన్మరణం



మేళ్లచెర్వు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని తల్లిదండ్రులు మందలించటంతో మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం పాత వెల్లటూరులో ఈ ఘటన జరిగింది. చింతలపాలెం ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాత వెల్లటూరుకు చెందిన గొలుసు వెంకటేశ్వర్లు(18) ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువు తున్నా డు. ఇటీవల కాలంలో సరిగా చదవడం లేదని, మార్కులు తక్కువగా వసున్నాయని తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు ఈ నెల 20వ తేదీన గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనత్త గాజుల సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి తండ్రి హనుమంతు, తల్లితో పాటు చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం పాత వెల్లటూరు గ్రామంలో వెంకటేశ్వర్లు అంత్యక్రియలు నిర్వహించారు.

రివిట్‌మెంట్‌కు మరమ్మతులేవీ..?

- డిండి ప్రాజెక్టుకు పొంచి ఉన్న ప్రమాదం


షూట్‌డ్రైన్ శిథిలావస్థకు చేరడంతో కోతకు గురైన మట్టికట్ట

(డిండి- ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవ డంతో డిండి ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుంది. డిండి ప్రాంత ప్రజలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన డిండి రిజర్వాయర్ రివిట్ మెంట్ (ప్రాజెక్టు లోపలి భాగం) మరమ్మతులకు నోచుకోవడం లేదు. దుందుభి న దిపై 1942లో నిజాం ప్రభువు 12,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యం రిజర్వాయర్ నిర్మించారు. నిర్మాణ సమయంలో పూర్తిగా ఇసుక, సున్నం మిశ్రమం(గచ్చు)తో స్పిల్‌వే, వియర్, రివిట్‌మెంట్‌తో నిర్మాణం చేపట్టారు. ఎంతటి వరదలకైనా నిలబడే విధంగా ప్రాజెక్టును అప్పటి ఇంజనీర్లు పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మించి 80 ఏళ్లకు పైగా కావస్తున్న కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టు లోపలి భాగంలోని రివిట్ మెంట్ పగుళ్లు తీసింది. నీటి అలల తాకిడికి క్రమంగా రివిట్ మెంట్ ప్రతి ఏడాది కొంత దెబ్బతింటూ వస్తుంది. రివిట్‌మెంట్ పగుళ్లలో మొ క్కలు పెరిగిన మరింత నష్టం కలిగిస్తున్నా యి. చెట్ల వేర్లు లోపలికి చొచ్చుకుపోయి రివిట్‌మెంట్ బీటలు వారుతుంది. దీంతో ప్రాజెక్టు భద్రతకు ప్రమాదం పొంచి ఉంది. ఎర్త్‌డ్యాం (మట్టి కట్ట)పై పడే వర్షపునీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన షూట్‌డ్రైన్లు (వర్షాపు నీరు పోవడానికి కట్టపైన ఏర్పాటు చేసివి) శిథిలావస్థకు చేరాయి. షూట్‌డ్రైన్‌లు దెబ్బతినడం వల్ల ఎర్త్‌డ్యాం నుంచి నీరు ప్రవహించి మట్టికట్ట కోతకు గుర వుతుంది. హెడ్ రెగ్యులేటర్ (ప్రధాన తూములు)కు అమర్చిన షటర్‌లు(తలుపులు)లో ఒకటి గ్రూప్ లో సరిగా కూర్చొక నీరు లీకేజీ అవుతుంది. హెడ్ రెగ్యులేటర్‌కు దిగువన ఉన్న క్రాస్ రెగ్యులేటర్లు తలుపులు దెబ్బతిన్నాయి.


డిండి ప్రాజెక్టులో రివిట్‌మెంట్‌పై ఏపుగా పెరిగిన మొక్కలు

మార్చిలో మరమ్మతు పనులు చేపడతాం



డిండి ప్రాజెక్టు మరమ్మతులకు ప్రతి పాదనలు సిద్ధం చేశాం. ఫైనల్‌గా మరోసారి అధికారులతో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదిస్తాం. నిధులు విడుదల కాగానే మార్చిలో మరమ్మతు పనులు మొదలుపెడుతాం.

- శ్రీధర్‌రావు , డిండి ప్రాజెక్టు ఈఈ

ఎంజీయూ వీసీని తక్షణమే తొలగించాలి

- నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల ఆందోళన
- డప్పు చప్పుళ్లతో నిరసన... తరగతుల బహిష్కరణ


ఎంజీయూలో వైస్‌ఛాన్సలర్ ఛాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తున్న మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు వైస్ చాన్సలర్ ఛాంబర్ ఎదుట బైఠాయించి డప్పు చప్పుళ్లతో నిరసన తెలిపారు. అనంతరం తరగతులను బహిష్కరించారు. విద్యార్థులు తెలిపిన సమాచారం మేరకు వివ రాలిలా ఉన్నాయి. ఈ నెల 30వ తేదీనుంచి ఆర్ట్స్, సైన్స్ పీజీ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. అన్నీ పాఠ్యాంశాలకు సరి పడా ప్రొఫెసర్లు లేక సిలబస్ పూర్తికాకపోవడంతో పరీక్షలను నెల రోజుల పాటు వాయిదా వేయాలని విద్యార్థులు కొద్ది రోజులుగా వీసీకి విజ్ఞప్తి చేస్తున్నారు. పరీక్షలు రాస్తే ఫెయిల్ అవుతామన్న భయంతో పలు మార్లు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, రిజిస్ట్రార్, వీసీ దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా పట్టించుకోకపోవడంతో సోమవారం వైస్‌ఛాన్సలర్ ఛాంబర్ ఎదుట విద్యార్థులకు ఆందోళనకు దిగారు. డప్పుచప్పుళ్లు చేస్తూ వీసీని తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేశారు. ఆ సమయంలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ యూనివర్సిటీలో లేరు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తక్షణమే జోక్యం చేసుకుని వీసీని తొలగించాలని డిమాండ్ చేశారు.

ఇంటిగ్రేటెడ్ ఐఎంబీఏ విద్యార్థులకు సంబంధించి 70నుంచి 80మందికి అటెండెన్స్ లేకున్నా వారికి మాత్రం తరగతులకు హాజరుకావాలని చెప్పి నెలరోజులు పరీక్షలకు గడువు పొడిగించారని, ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు నెలరోజుల సమయం కావాలని కోరితే పొడిగించడం లేదని ఆరోపించారు. తక్షణమే యూనివర్సిటీ వీసీని తొలగించాలని, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అక్కడకు చేరుకుని వీసీ వచ్చాక మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అంతకు ముందు ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు తరగతులను బహిష్కరించి యూనివర్సిటీ క్యాంపస్‌లో ర్యాలీ, ఆందోళన చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

శివకేశవులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న శివాలయంలో సోమవారం శివకేశవులకు విశేష పూజలు చేశారు. స్వయంభూ ఆలయంలో స్వామి అమ్మవార్లకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంక ర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజా రులు విష్వక్సేనుడికి తొలి పూజలు, చేపట్టి సుదర్శనహోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహిం చారు. సంధ్యవేళ అలం కార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయం లోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.46, 36,685 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.


శివాలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు

రాజ్యాంగ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

మర్రిగూడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల మీద, రాజ్యాంగ హక్కుల మీద ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ మోడల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తే జీవితంలో ఏదో ఒక రంగంలో స్థిరపడుతారని ఆయన అన్నారు. రాజ్యాంగం హక్కులను ఇచ్చిందని, హక్కులను కాపాడే చట్టాలు ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులపై అవగాహన ఉండాలని వారు సూచించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదు

మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రోజు మధ్యాహ్న భోజనం సరిగా లేక తినలేక పోతున్నామని విద్యా ర్థులు అంజన్‌రావుకు వెల్లడించారు. స్పందించిన అంజన్‌రావు ప్రభు త్వం అందిస్తున్నటు మధ్యాహ్న భోజనం నాణ్యత కలిగి ఉండే విధంగా చూడాలని ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలంటూ ఎంఈవో బిట్టు శ్రీనివాస్‌కు సూచించారు. ప్రతిరోజు మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని వారు సూచించారు. అనంతరం మర్రిగూడ మండల కేంద్రంలో ఉన్నటువంటి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సక్కుబాయి. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కళా శ్రీనివాస్, మాస బాలరాజు, సూపర్ వైజర్ యశోద, నిర్మల ఉన్నారు.


బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న అంజన్‌రావు

అర్హులకే సంక్షేమ పథకాలు ఇవ్వాలి : బీజేపీ

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను నిజమైన అర్హులకే అందజేయాలని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు వేమిరెడ్డి భిక్షంరెడ్డి అన్నారు. జాబితాలో పేరు లేని వారు ఆందోళన చెందిన ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పథకాలకు నిజమైన అర్హత లేమిటో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లగొండ మున్సిపాలిటీని బీజేపీ కైవసం చేసుకుటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తీగల శ్రవణ్‌కుమార్, యాదగిరి, జెల్లా మణికంఠ, పున్న రమేష్ ఉన్నారు.

హామీలను అమలుచేయాలి

శాలిగౌరారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, పథకాలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్ల పేదలకు ఇచ్చిన హామీలను అందరికీ అమలు చేయకపోవడం వల్లే ప్రజలు ఓడించారని అన్నారు. అన్ని గ్రామాల్లో పథకాలు అమలు చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మక్క బుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, రమేష్, దేవచిత్తం, కుమార్, బట్ట సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తిప్పర్తి బైపాస్ జంక్షన్



తిప్పర్తి తిప్పలమ్మగూడెం జంక్షన్‌వద్ద ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న వాహనదారులు

తిప్పర్తి: తిప్పర్తి బైపాస్ జంక్షన్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి - నార్కట్‌పల్లి ప్రధాన హైవేలో తిప్పర్తి మండల కేంద్రం వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు 10 నెలలుగా సాగుతున్నాయి. కానీ ఆ నిర్మాణ పనులు పూర్తి కాకముందే తిప్పర్తి మండల కేంద్రంలో జరిగే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో తిప్పర్తి మండల కేంద్రానికి రాకుండా నేరుగా బైపాస్ రోడ్డులో వెళ్లాల్సి వచ్చింది. దీంతో మండల కేంద్రంలో ఆగాల్సిన ఆర్టీసీ బస్సులు కూడా బైపాస్ నుంచే వెళ్తుండటంతో మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులకు అరకిలోమీటరు నడవాల్సిన పరిస్థితి. ఇదిలా ఉండగా నూతనంగా నిర్మించిన బైపాస్‌రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందే ఒకపక్కన పూర్తి అయిన రోడ్డు తెరిచి వాహనాలను దారి మళ్లిస్తున్నారు. దీంతో తిప్పర్తి మండల కేంద్రానికి వెళ్లే జంక్షన్‌లో రోడ్డు ఇరుక్కుగా ఉండటంతో వేగంగా వచ్చే వాహనాల మధ్య రోడ్డు దాటడం కష్టంగా మారిందని ద్విచక్రవాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. తిప్పలమ్మగూడెం రోడ్డు జంక్షన్ వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల కోసమైనా సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



నాంపల్లి నుంచి మర్రిగూడకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

నాంపల్లి: మండల కేంద్రం నుంచి మర్రిగూడకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా పదుల సంఖ్యలో మూలమలుపులు ఉన్నాయి. ప్రతీరోజు గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు, నాంపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ప్రజలు, వ్యాపారులు, అధికారులు మర్రిగూడ మీదుగా మాల్‌కు, హైదరాబాద్‌కు ప్రతీరోజు వందలాది వాహనాల్లో వెళ్తుంటారు. ఈ రహదారి వెంట ప్రమాదకరమైన మూలమలుపులు చూసి వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారి వెంట ప్రమాదకరమైన మూల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరికల సూచికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. నాంపల్లి నుంచి మర్రిగూడకు వెళ్లే రహదారిలో చిట్టెంపాడు వద్ద నెమిళ్లగూడెం, దామెర, కమ్మగూడెం, భీమనపల్లి, లెంకలపల్లి గ్రామాలకు వెళ్లే లింకురోడ్డు వద్ద ప్రమాదకరమైన మూల మలుపు వద్ద సూచికల బోర్డుగాని, ప్రమాద హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా వడ్డేపల్లి ఊరి చివరలో ఉన్న గౌరారం, తుంగపాడు, హరిజనపురం, చింతపల్లికి వెళ్లే లింకురోడ్డు వద్ద కూడా ప్రమాదకరమైన మూలమలుపు ఉన్నాయి. అధికారులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలతో పాటు సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

గురుకులాలు పిలుస్తున్నాయ్..



మైనార్టీ పాఠశాల

గుర్రంపోడు: నల్లగొండ జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాలల్లో 5వ తరగతి, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్ర వేశాలు, 6,7,8 తరగతులకు మిగిలిపోయి ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల గడువు ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉంది. ఇతర గురుకులాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. కానీ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి ఎలాంటి షరతులు లేవు. మొదట వచ్చిన వారికి ప్రాధాన్యతగా మైనార్టీలకు సీట్లు కల్పిస్తారు. నాన్‌మైనార్టీలకు లక్కీడిప్ ద్వారా సీట్ల కేటాయిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ సీహెచ్. విష్ణుమూర్తిగౌడ్ తెలిపారు. నల్లగొండ జిల్లాలో మైనార్టీల గురుకుల పాఠశాలలు, కళాశాలలు మొత్తం 6 ఉన్నాయి. బాలికలకు 3, బాలురకు 3 పాఠశాల, కళాశాలలు ఉన్నాయి.

ఓపీఎస్ విధానం అమలుచేయాలి



నల్లగొండలో వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మునుగోడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా మారిన సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని పీఆర్‌టీయూ నేతలు విజ్ఞప్తి చేశారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం భోజన విరామ సమయంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి తరలివచ్చిన పలువురు ఉపాధ్యాయులు మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేందర్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ముందుగా కార్యాలయం ఎదుట కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. అప్పటి వరకు తమ ఆందోళనలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ పాషా, అన్నపురెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, శే ఖర్, నాగేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, నర్సింహా, రాజేష్, స్వామి, విద్యాసాగర్, రవీందర్, లక్ష్మీప్రసాద్, ఉపేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలనీ టీపీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కంచర్ల సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ స్కీంను పీఆర్‌టీయూ వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బచ్చు లుకేందర్‌రెడ్డి, అంబటి సత్తయ్య నేలపట్ల సైదులు, చిరుమర్తి శంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మాత్రమే జాబ్‌కార్డులు ఇవ్వాలి



ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీలో పాల్గొన్న ఏపీడీ నవీన్ కుమార్

● ఏపీడీ నవీన్‌కుమార్

చండూరు రూరల్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): అర్హులకే ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఏపీడీ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. 23 పంచాయతీల్లో మొత్తం రూ.2,20,36,884 ఖర్చు చేయగా, వాటి రికార్డులను పరిశీలించి చదివి వినిపించారు. కొన్ని అవకతవకలను గుర్తించి సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల వివరణ తీసుకున్నారు. రూ.17,857 రికవరీల, ఆరుగురికి రూ.6వేల జరిమానాలు విధించారు. ఇద్దరు టీఏలు వెంకన్న, యాదయ్య, ఈసీ రాజ్‌కుమార్‌కు షోకాజ్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలన్నారు. ప్రతీ పంచాయతీలో ప్లాంటేషన్ మొక్కలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధిహామీలో అవకతవకలు జరగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ భరోసా కింద నూతన జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, కనీసం 20 రోజులు పనిచేసి ఉంటేనే జాబ్ కార్డులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీవీవో వేణుగోపాల్‌రావు, క్వాలిటీ కంట్రోలర్ ఫరూఖుద్దీన్, విజిలెన్స్ మేనేజర్ గౌతమి, స్టేట్ రీసెర్చ్ పర్సన్ వెంకన్న, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో మాధవరెడ్డి, ఏపీవో శ్రీనివాస్ టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

లాక్డ్ హౌస్ 'వ్యూహం'..దొంగల పట్టివేత

ఫలితాలిస్తున్న జిల్లా ఎస్పీ వ్యూహం



ఎస్పీ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ అఖిల్‌కుమార్

నార్కట్‌పల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దొంగతనాల నియంత్రణకు జిల్లా ఎస్పీ రూపొందించిన 'లాక్డ్ హౌస్' వ్యూహం ఫలించింది. దొంగలను నేరుగా పట్టించింది. జిల్లాలో ఇళ్ల, వ్యాపార సంస్థల్లో జరుగుతున్న వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. దొంగతనాలను అదుపుచేయాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 'లాక్డ్ హౌస్' వ్యూహం రచించారు. తాళం వేసి ఇళ్లనే టార్గెట్ చేసి దొంగలు ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. తమ ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు నగలు, నగదు, వస్తువులను భద్రపర్చుకుని వెళ్లాలని, పరిసర నివాసితులకు, పోలీసులకూ సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించాలని ఎస్పీ పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో నార్కట్‌పల్లి మండలంలోని గుమ్మలబావి శివసాయినగర్‌లో ఇంటికి తాళం వేసి వెళ్లిన ఇళ్ల వద్ద పోలీసులు రాత్రి గస్తీ నిర్వహించారు. అదే సమయంలో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసేందుకు ప్రయత్నించిన దొంగలను పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్ల సత్యనారాయణ, అఖిల్‌కుమార్ సాహసం చేసి పట్టుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్, ఎస్పీ కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

హామీల అమలులో ప్రభుత్వ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నరాజ్

కట్టంగూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. కట్టంగూరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరిస్తోందని ఆరోపించారు. పథకాలు అమలు చేస్తామని చెప్పి గ్రామసభలు నిర్వహించి అందరికీ ఇవ్వకుండా మండలానికో ఒక ఊరును పైలట్ గ్రామంగా ఎంచుకొని మళ్లీ ప్రజలను మోసం చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండలో జరిగే రైతు ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఉట్కూరి ఏడుకొండల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, గుండాల మల్లేష్, సైదిరెడ్డి, మేకల రమేష్, కొప్పు రాములు, నాగార్జున నర్సింహ, శివ ు పాల్గొన్నారు. రైతు ధర్నాను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పెద్ద బాలనర్సింహ, పోగుల నర్సింహ, నోముల వెంకటేశ్వర్లు, పోగుల నర్సింహ, రెడ్డిపల్లి మనోహర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



కలెక్టర్‌కి వినతిపత్రం అందిస్తున్న శంకర్ మేతరి

నల్లగొండరూరల్, జనవరి 27: మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేతరి శంకర్ కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఆయన పలువురితో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అర్హులైన వారికి రేషన్‌కార్డు రాలేదని కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలో కూడా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వావిళ్ల నరసింహ, అయితగోని వెంకటయ్య ప్రసాద్, దామర మల్లేష్ ,వావిళ్ల దేవదాస్, అయితే గోని నరేష్, సతీష్, హరీష్, రవి, రమేష్ ఉన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కట్టంగూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) 2025 క్యాలెండర్‌ను సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో అంబటి అంజయ్య ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఈదులూరు, కురుమర్తి హైస్కూల్ హెచ్‌ఎంలు నర్సిరెడ్డి, కవిత, ఆ సంఘం అలుగుబెల్లి పాపిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్, మండల అధ్యక్షుడు పాండరి, యాదగిరి పాల్గొన్నారు.

కళా ప్రదర్శనను విజయవంతం చేయాలి



శాలిగౌరారంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సోమన్న

నల్లగొండటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్సీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్‌మాదిగ అన్నారు. ఈ నెల 31వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉప కులాలకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఫిబ్రవరి 8వ తేదీలోపు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే విజయోత్సవమని, లేకపోతే చావు డప్పు మోగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఎంఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబుమాదిగ, నాయకులు ఆడపు నాగార్జున, ఎర్ర వీరస్వామి, మచ్చ ఏడుకొండలు, కొమిరే స్వామి, పాల్వాయి బాలయ్య, శీను, కమలమ్మ పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో దేవరకొండ మస్తాన్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను సోమన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో జానయ్య, హల్లయ్య, సాలయ్య, కృష్ణ పాల్గొన్నారు.

● శాలిగౌరారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపథకాలను అన్ని గ్రామాలకు అమలుపర్చాలని సీపీఎం శాలిగౌరారం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య కోరారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామసభల్లో అన్ని గ్రామాల్లో పథకాలు అమలు చేస్తామని చెప్పి నేడు మళ్లీ మండలానికి ఒక గ్రామంలో పథకాలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు. సమావేశారం మక్క బుచ్చి రాములు, లింగయ్య, ఎర్ర రవేష్, దేవచిత్తం, చలకాని కుమార్, సైదులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడంపల్లిలో 15 రోజులుగా నిర్వహించిన చౌడంపల్లి ప్రీమియర్ లీగ్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతి కుమార్ ఆదివారం రాత్రి ట్రోఫీ ప్రదానం చేశారు. టోర్నీని నిర్వహించిన ఉదయ్‌ను ఎస్ఐ అభినందించారు. కాగా 26వ రిపబ్లిక్ డే రోజున ఫైనల్ మ్యాచ్ పోటీలను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రారంభించారు. మొత్తం 32 టీంలు పాల్గొన్నాయి. తాళ్లవెల్లెంకు చెందిన స్వామి లెవెన్ జట్టు విజేత, దామెర ఉదయ్ టీ రన్నరప్‌గా నిలిచాయి. మూడవ స్థానంలో తొండ్లాయి పీడీ లెవెన్ టీం నిలిచింది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కాస్మిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ నాచురోపతి ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కైసర్ సబిహా, నాచురోపతి, ఆక్యుపంక్చర్ హీలర్స్ నరేందర్ సబ్బం, ప్రతిమ, జ్ఞాన ప్రసూన, బిందుమతి, లక్ష్మీ, తరుణి, పాఠశాల ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, వాహిద్, నర్సయ్య, లీలావతి, వెంకన్న, చందన పాల్గొన్నారు.

● చిట్యాల,(ఆంధ్రజ్యోతి);చిట్యాల మండల సమగర మోచి సంఘం కార్యవర్గాన్ని సోమవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాస జగన్, ప్రధాన కార్యదర్శిగా దొంతుల నవీన్‌కుమార్, కోశాధికారిగా చంద్రగిరి శివమదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తుంగతుర్తి వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రగిరి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మాస సత్యనారయణ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మాస రమేష్ వ్యవహరించారు.

● కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి): కేతేపల్లిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో నూతనకల్ మండల జట్టు ప్రథమ స్థానం, కేతేపల్లి, తడకమళ్ల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు నగదు ప్రోత్సాహకాలను నిర్వహకులు అందజేశారు వెంకన్నయాదవ్, టి.వెంకన్న, మహేష్, శంభ య్య, అరుణ్, ప్రభాకర్, విజయరాణి, పాపయ్య పాల్గొన్నారు.

●మర్రిగూడ, (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడే పొనుగోటి అంజన్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో బిట్టు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం, మండలాధ్యక్షుడు గ్యార వెంకటేష్, బాలాజీ ఉన్నారు.

●మర్రిగూడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరగండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ సోమవారం ముగిసింది. విద్యార్థులు రెండు రోజులుగా రాజ్యాంగంలోని హక్కు లు, విధులు, ఆదేశిక సూత్రాలు, ఓటు విలువలను తెలపర్చారు. రాజ్యాంగం గొప్పతనం తెలుసుకోవాల్సిన అవశ్యకత నేటి సమాజానికి ఎంతో ఉందని హెచ్‌ఎం మాలతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

●నాంపల్లి (ఆంధ్రజ్యోతి),మండలంలోని దామెర , చిట్టెంపాడ్, వడ్డేపల్లి, లింగోటం లోని ప్రభుత్వ పాఠశాలలోని 235 మంది విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ మహనీయుల చిత్ర పటాలను మండల ఫౌండేషన్ సభ్యులు నాంపల్లి సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందిస్తూ వారి చదువులకు సహకరం అందిస్తున్నాడు. ఆయన వెంట ఫౌండేషన్ సభ్యులు పంగ ఈశ్వర్, పొలగోని శ్రీకాంత్, పొలగోని నాగరాజుఉపాధ్యాయులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 28 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 17.0

నేడు బీఆర్ఎస్ రైతు మహాధర్నా

- హాజరు కానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు



మహాధర్నాకు నల్లగొండలో ఏర్పాటుచేసిన వేదిక

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వ్యవసాయరంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ పట్టణంలో మహాధర్నాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ మహాధర్నాకు మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తా వద్ద ఈ ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లు, స్వాగత తోరణాలు పట్టణమంతా ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై మాజీ మంత్రి గుంటకండ్ల

- మిగతా 6వ పేజీలో...

తొలి రోజు రూ.111.72 కోట్లు



- రైతు భరోసా జమ షురూ
- 82,436మంది రైతులకు లబ్ధి

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా నగదు జమను ప్రభుత్వం సోమవారం ప్రారంభించింది. మండలానికి ఒక గ్రామం చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. తొలి రోజు 82,436మంది రైతులకు రూ.111.72కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద ప్రభుత్వం ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు సీజన్లు చెల్లించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుభరోసాను సీజన్‌కు ఎకరాకు రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీఇవ్వగా, ఆ మేరకు ఈ పథకాన్ని ఈనెల 26న లాంఛనంగా ప్రారంభించారు. అయితే ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం నగదు జమ ప్రారంభమైంది. నల్లగొండ మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ ప్రభుత్వం రైతుభరోసాను చెల్లించింది.

82,436మందికి రైతు భరోసా నగదు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోమవారం 82,436మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.111.72కోట్లు జమయ్యాయి. నల్లగొండ జిల్లాలో 33 మండలాల్లో 33 గ్రామాల్లో 35,508మంది రైతులకు రూ.46.93కోట్లు, సూర్యాపేట జిల్లాలోని 23...

- మిగతా 6వ పేజీలో...

నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాతబడిన అంగన్‌వాడీ, ప్రాథమిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. పాతబడిన అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే కొత్త భవనాల్లోకి మార్చాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఆమె అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. అనంతరం ఆమె జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి ప్రారంభించిన రైతు భరోసా పెండింగ్ దరఖాస్తులను నెలాఖరులోగా పరిశీలించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయితో పాటు, మండల గ్రామస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతంగా చేయాలని సూచించారు. పాతభవనాల్లో నిర్వహించే అంగన్‌వాడీ, పీహెచ్‌సీలతో ప్రమాదం పొంచి ఉందని, కొత్త భవనాల్లోకి మార్చాలన్నారు. అలాగే అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణాలకకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కాగా సోమవారం సుమారు 119 మంది తమ అర్జీలను కలెక్టర్‌తో పాటు, అధికారులకు సమర్పించారు. ఇదిలా ఉండగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు, అలాగే మార్చి 5 నుంచి మార్చి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమం అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది నిర్వహించే ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా ప్రతి ల్యాబ్‌లో తప్పనిసరిగా రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబ్‌లలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుందని, ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు సీసీ కెమెరాలను తప్పనిసరిగా యాజమాన్యాలు ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఆయా పరీక్షా కేంద్రాలను రద్దు చేస్తామన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 5 నుంచి నిర్వహించే ఇంటర్ వార్షిక పరీక్షలకు కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దశ్రునాయక్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మినీ భారత్‌గా మల్కాపురం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శివారులోని ఒకప్పటి పారిశ్రామిక ప్రాంతాలైన జీడిమెట్ల, బాలానగర్, చర్లపల్లి, నాచారం, ఉప్పల్‌లకు నగరం విస్తరించింది. ప్రజాజీవనం పెరిగి పరిశ్రమలు అక్కడ మనుగడ సాగించడం, కొత్తవి ఏర్పాటుచేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటుచేసింది. 550 ఎకరాల్లో 300 పరిశ్రమలు ఏర్పాటు లక్ష్యంగా నెలకొల్పిన ఈ పార్క్ దేశంలోనే అతిపెద్ద ఎంఎస్ఎంఇ హరిత పారిశ్రామిక పార్క్‌గా రూపుదిద్దుకుంటోంది. ఇక్కడి పరిశ్రమల్లో పనిచేసేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులతో దండుమల్కాపురం ప్రాంతం మినీభారత్‌ను తలపిస్తుంటుంది.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్)






- పరిశ్రమల పల్లెగా నెలవు
- దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్
- ఒకే పల్లెలో వందలాది పరిశ్రమలు, పెద్దసంఖ్యలో ఉపాధి
- 100 ఎకరాల్లో టౌన్‌షిప్ ఏర్పాటుకు సన్నాహాలు

చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామం పరిశ్రమలకు నెలవుగా మారింది. ఒకనాడు కొండలు, గుట్టలు, రాళ్లరప్పలతో నిరుపయోగంగా ఉన్న ఇక్కడి భూముల్లో నేడు వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్రంలో లక్షలాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉండగా అందులో సగానికి తక్కువ శాతం పరిశ్రమలకు సొంత స్థలాలు ఉన్నాయి. అద్దె స్థలాల్లో పరిశ్రమలు కొనసాగలేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఈ అంశంలో తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రత్యేక చొరవ చూపింది. అప్పటి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి దండుమల్కాపురంలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయించింది.

పరిశ్రమల ఏర్పాటు..

దండు మల్కాపురం గ్రామంలో మొత్తం 11,527 ఎకరాల భూమి ఉంది. దానికి తోడు ప్రభుత్వ, అసైన్డ్ భూములు కూడా ఎక్కువగా ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. దీంతో ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా నిర్మించిన ఈ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఇండస్ట్రియల్ పార్క్‌ను 2019 నవంబరు 1న నాటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అయితే పూర్తిస్థాయిలో కాలుష్య రహిత పరిశ్రమలకే ఈ పార్క్‌లో కేటాయింపులు చేస్తున్నారు. 550 ఎకరాలు కేటాయించిన ఈ పారిశ్రామిక పార్క్‌లో దశలవారీగా 300 పరిశ్రమలు నెలకొల్పనున్నారు. ఇప్పటికే 175 పైగా పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయి. 100కు పైగా పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. రెండు శాతం పరిశ్రమలు ఇంకా నిర్మాణాలను మొదలుపెట్టలేదు. పనులు మొదలుపెట్టని పరిశ్రమ యజమానులకు నోటీసులు కూడా పంపించారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు మరింత స్థలం కావాలని పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రభుత్వానికి విన్నవించింది. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే మరికొంతమంది పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు స్థలం మంజూరు చేసే అవకాశం ఉంది. పరిశ్రమలు ప్రారంభించిన, నిర్మాణంలో ఉన్న వాటిలో ఇప్పటికే పెద్దసంఖ్యలో కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈపారిశ్రామిక పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు లభించడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని పారిశ్రామికవేత్తలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో అన్నిరకాల పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ప్యాకింగ్ ప్రింటింగ్, టైల్స్ ఫార్ములేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, రైస్ హట్, బొమ్మల పార్క్‌లువంటి కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అంతేకాకుండా జాతీయరహదారికి ఆనుకుని రూ.2,800 కోట్ల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెర్మినల్ నిర్మిస్తోంది. అంతేకాకుండా రూ.1500 కోట్ల వ్యయంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నిర్మాణ..

- మిగతా 6వ పేజీలో...

యువత కోసమే 'మిషన్ పరివర్తన'



క్రీడాపోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మిషన్ పరివర్తన్ - యువతేజం కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆసక్తి కలిగిన యువతకు కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. విజేతలైన జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన గ్రామీణ యువత జట్ల క్రీడాకారుల జాబితాను తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిబ్రవరి 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ మండల స్థాయిలో కబడ్డి పోటీలు ఉంటాయన్నారు. అక్కడ గెలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.2,500, మూడో బహుమతి రూ.1,500 అందజేస్తారన్నరు. అదేవిధంగా మండలస్థాయిలో గెలుపొందిన జట్లకు ఫిబ్రవరి 10 నుంచి 16వ తేదీ వరకూ డివిజన్, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. డివిజన్ స్థాయిలో గెలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతిగా రూ.2500 అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలిచిన ప్రథమ విజేతకు రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలను అందజేస్తామని ప్రకటించారు. కబడ్డీపై మక్కువ ఉన్న క్రీడాకారులు విధిగా ప్రాతినిధ్యం వహించి తమ క్రీడా ప్రావీణ్యాలను ప్రదర్శించాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

నల్లగొండ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సంబంధిత అవసరాలుండే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన 30 మంది బాధితుల సమస్యలను విని వారి అర్జీలను స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. పూర్తి వివరాలను సమర్పించాలని ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ బాధితుల అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. అర్జీదారులకు నమ్మకం, భరోసా కలిగించాలన్నారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, చర్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

సాగర్ బుద్ధవనం అద్భుతం



నాగార్జునకొండ మ్యూజియంలో నాగ్‌పూర్ బౌద్ధులు

నాగార్జునసాగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం అద్భుతంగా ఉందని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన బౌద్ధులు అన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం వారు సందర్శించారు. మొదటగా జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ లాంచీలో చేరుకున్నారు. అక్కడ మ్యూజియం, బౌద్ధ మత స్తూపాలను, నమూనాలను, సింహళీయం, అశ్వమేథ యాగశాలలను తిలకించారు. అనంతరం బుద్ధవనానికి చేరుకొని బుద్ధవనంలో జాతక, స్తూప, చరిత, ధ్యాన వనం, బుద్ధుని పాదాలు, మహాస్తూపాలను సందర్శించారు. మహారాష్ట్రకు చెందిన రాజా టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో తెలంగాణలోని బౌద్ధ మత క్షేత్రాలను, ప్రాంతాలను సందర్శిస్తున్నట్లు వారు తెలిపారు. వారికి పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జున కొండ విశేషాలను వివరించారు.

పశుగణనకు సమగ్ర సమాచారం అందించండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వేశ్వరరావు

దేవరకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా చేపట్టిన 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా ఇంటిముందుకు వచ్చే వారికి సమగ్ర సమాచారం అందించాలని జిల్లా పశువైద్య శాఖఖ సహాయ సంచాలకులు బొడ్డు విశ్వేశ్వరరావు సూచించారు. దేవరకొండ పశువైద్యశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28వ తేదీతో పశుగణన పూర్తవుతున్నందున సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 163 మంది ఎన్యుమరేటర్లు దాదాపు 50 మంది సూపర్‌వైజర్లు పశుగణనలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. సర్వేలో ఆయా రైతులకు చెందిన అన్ని రకాల పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఇతర పక్షుల వివరాలు సేకరిస్తారని తెలిపారు. ప్రతీ ఐదేళ్లకోసారి జరిగే గణన ఆధారంగా పశుసంవర్ధక శాఖ మార్గదర్శకాలు రూపొందించుకుని ముందుకెళ్తుందన్నారు. పశుగణన ద్వారా ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తూ పథకాల రూపకల్పన చేస్తాయన్నారు. ఎంతో ముఖ్యమైన ఈ సర్వేను విజయవంతం చేసేందుకు రైతులు సమగ్ర సమాచారం ఇచ్చి తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో స్థానిక వైద్యాధికారులు డాక్టర్ నాగయ్య, ధనలక్ష్మి, రవి, యమున, శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటుకు కృషి

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనలో మోత్కూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం వీడ్కోలు సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, అమ్మనబోలు, వేములకొండ మండలాలుగా ఏర్పాటయ్యే అవకాశముందన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం)తో పాటు సమీపంలోని ఒకటి రెండు మండలాలను కలిపి మోత్కూరును నియోజకవర్గం చేయాలని ప్రభుత్వం, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నుంచి యాసంగికి బిక్కేరు వాగులోకి నీటి విడుదల చేయించానని తెలిపారు.

మిర్యాలగూడ
నాగార్జునసాగర్-దేవరకొండ

గురుకులాలు పిలుస్తున్నాయ్..



మైనార్టీ పాఠశాల

గుర్రంపోడు: నల్లగొండ జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాలల్లో 5వ తరగతి, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు, 6,7,8 తరగతులకు మిగిలిపోయి ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల గడువు ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉంది. ఇతర గురుకులాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. కానీ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి ఎ లాంటి షరతులు లేవు. మొదట వచ్చిన వారికి ప్రాధాన్యతగా మైనార్టీలకు సీట్లు కల్పిస్తారు. నాన్‌మైనార్టీలకు లక్కీడిప్ ద్వారా సీట్ల కేటాయిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ సీహెచ్. విష్ణుమూర్తిగౌడ్ తెలిపారు. నల్లగొండ జిల్లాలో మైనార్టీల గురుకుల పాఠశాలలు, కళాశాలలు మొత్తం 6 ఉన్నాయి. బాలికలకు 3, బాలురకు 3 పాఠశాల, కళాశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రతి సెక్షన్‌కు 40 చొప్పున మొత్తం 80 సీట్లు ఉంటాయి. ఇంటర్మీడియట్‌లో ప్రతి గ్రూపునకు 40 చొప్పున మొత్తం 80 సీట్లు ఉంటాయి. వీటిలో 25శాతం నాన్‌మైనార్టీలకు కేటాయింపు ఉంటుంది.

జీపీ కార్మికులకు అందని జీతం

డిండి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్య కార్మికులకు అందాల్సిన వేతనాలు వెనక్కు వెళ్లాయి. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 38గ్రామపంచాయతీల సర్పంచులు రెండేళ్ల క్రితం దేవరకొండ పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో టీఎస్ బిపాస్ ఖాతాలు తెరిచారు. ఆ సమయంలో కొన్ని గ్రామపంచాయతీల ఉప సర్పంచులు సస్పెండ్ కావడంతో ప్రత్యేక అధికారి సర్పంచ్‌కు జాయింట్ చెక్‌పవర్ ఇచ్చారు. సర్పంచ్, ప్రత్యేక అధికారి జాయింట్ ఖాతాలను ప్రారంభించారు. ఖాతాలు తెరిచే సమయంలో సంతకాలు సరిపోలక పోవడంతో పాటు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో మండలంలోని బొగ్గులదొన, బొలనపల్లి, బ్రహ్మణపల్లి, డి.నెమలిపూర్, దేవత్‌పల్లితండా, హజ్యతండా, కామేపల్లి, ఖానాపూర్, కిందిశేషాయికుంట, కుందేలుబాయితండా, పెద్దతండా, రామంతపూర్, శక్రుతండా, శాంతిగూడెం పంచాయతీల సర్పంచులు తెరిచిన ఖాతాలను బ్యాంకు అధికారులు రిజెక్ట్ చేశారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత జీపీలకు ప్రత్యేక అధికారులు రిజెక్ట్ అయిన ఖాతాలను సవరించడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో 14 జీపీల్లో సుమారు 40 మంది పారిశుధ్య కార్మికుల 3 నెలల వేతనాలు (అక్టోబరు, నవంబరు, డిసెంబరు) కోల్పోయారు. సుమారు 11లక్షలకు పైగా కార్మికుల వేతనాల నిధులు వెనక్కు వెళ్లాయి. ఖాతాలు సరిగా ఉన్న 24 పంచాయతీలలో పనిచేసే కార్మికుల వేతనాలు టీఎస్ బీపాస్ ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ మేరకు డీపీవో వెంకయ్య వివరణ కోరగా సాంకేతిక కారణాల వల్ల కొన్ని పంచాయతీలలో పనిచేసే కార్మికులకు వేతనాలు అందలేదు. ఎంపీడీవో మాట్లాడి మరో ఖాతా ద్వారా కార్మికులకు వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుట్టగొడుగుల్లా నీటిశుద్ధి కేంద్రాలు



చింతపల్లిలోని ఓ నీటి శుద్ధి కేంద్రం

చింతపల్లి: మండలంలో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. చింతపల్లి మండలంలో సుమారు 100వరకు నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా నీటిని క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు 20 లీటర్ల క్యాన్‌కి రూ.15 నుంచి రూ. 25 వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. నీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు గ్రామపంచాయతీతో పాటు జిల్లా ఆహార పరిరక్షణ విభాగం నుంచి అనుమతి పొందాలి. బోరు వేసేందుకు వాల్టా చట్టం కింద రెవెన్యూ, భూగర్భ జల శాఖల నుంచి అనుమతితో పాటు నిరభ్యంతర పత్రం తెచ్చుకోవాలి. అప్పుడే విద్యుత్ శాఖ వారు సరఫరా ఇవ్వడానికి అనుమతి ఇస్తారు. నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు చేసుకునే వారు ప్రత్యేక గదులు కేటాయించాలి. వాటికి అనుబంధంగా నీటిని పరీక్షించేందుకు ప్రయోగశాల ఉండాలి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం నిబంధనలు పాటిస్తున్నారో లేదో తనిఖీలు చేయకపోవడం వల్ల తాగునీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రమాకాంత్‌శర్మను వివరణ కోరగా నీటిశుద్ధి కేంద్రాల నిర్వాహకులు లైసెన్స్ పొందాలి. నిబంధనలు పాటించని నిర్వాహకులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పబ్లిక్ డిమాండ్ PUBLIC DEMAND

వెలవెలబోతున్న గ్రంథాలయం



డిండిలో ఉన్న శాఖా గ్రంథాలయం

డిండి: డిండి మండల కేంద్రంలో 1992లో ఏర్పాటు చేసిన విజ్ఞాన భాండాగారం ఆలనా, పాలనాలేక వెలవెలబోతోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగ యువతి, యువకులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో పక్కా భవనాన్ని నిర్మించారు. గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు, ఫర్నీచర్, బీరువాలు, ఇతర సౌకర్యాలను గ్రామస్థులు సమకూర్చారు. ఇక్కడ పనిచేస్తున్న లైబ్రేరియన్ 2011లో పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత అటెండర్ గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నారు. చిన్న గది కావడంతో 30 మందికి మించి చదువుకునే అవకాశం లేదు. గ్రంథాలయ ఆవరణలో ఎలాంటి తాగునీరు, వాష్‌రూంలు, మౌలిక వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయానికి ప్రహరీ నిర్మాణం లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. క్రమంగా పాఠకుల సంఖ్య తగ్గిపోయి ఆదరణ కోల్పోయింది. గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి

● గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం

● ఇబ్బందుల్లో ప్రయాణికులు, పట్టించుకోని అధికారులు

పబ్లిక్ డిమాండ్ PUBLIC DEMAND



గుర్రంపోడు బ్రిడ్జి వెంట మొలిచిన పిచ్చిమొక్కలు

గుర్రంపోడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండల కేంద్రం శివారులోని నల్లగొండ - దేవరకొండ ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి పైనుంచి మండల కేంద్రానికి రక్షిత మంచినీటిని అందించే పైప్‌లైన్ వేశారు. బ్రిడ్జి అంచు నుంచి వేసిన ఈ పైప్‌లైన్ లీకవుతుండడంతో వచ్చే నీరు బ్రిడ్జి కిందకి జారుతోంది. దీంతో బ్రిడ్జి రాళ్ల సందుల్లో పిచ్చి మొక్కలు పెరుగుతుండటంతో బ్రిడ్జి కుంగే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచినప్పుడల్లా అక్కడి నుంచి నీరు వెళ్లేలా గుంతను తీయడం మినహా కొత్తగా పైప్‌లైన్ వేసి శాశ్వత పరిష్కారం చూపడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిజాంకాలంలో సిమెంట్, కాంక్రీట్ లేకుండా రాయితో నిర్మించిన ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టి రక్షించుకోవాలని, బ్రిడ్జిపై గుంతలు పూడ్చి పైప్‌లైన్ లీకేజీలు లేకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతలను వెంటనే పూడ్చివేయాలి. బ్రిడ్జిపై ఉన్న మంచి నీటి పైప్‌లైన్ తొలగించి సమస్యను పరిష్కరించాలి.

● వేణుగోపాల్, అధ్యాపకుడు

దేవరకొండ మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి : బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన మునిసిపల్ పాలకవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం పదవీ కాలం ముగిసిన మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు సిరాజ్‌ఖాన్, జానీయాదవ్, పున్న వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక



రోడ్డు భద్రత వారోత్సవాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ మౌనిక

కొండమల్లేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా సోమవారం కొండమల్లేపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. అతివేగంతో ప్రయాణించి ప్రాణాలు కోల్పోవద్దని ఆమె సూచించారు. వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ ధనుంజయ, ఎస్ఐ రామ్మూర్తి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారినే ఎమ్మెల్సీగా గెలిపించాలి

● టీజాక్ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించే వారినే ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని టీజాక్ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడలోని మోడల్ స్కూల్స్, గురుకులాలు బీసీ వెల్ఫేర్, కేజీబీవీలలో సోమవారం ఆయన పర్యటించి టీచర్లను కలిసి కరపత్రాలు పంపిణీ చేసి ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల కోసం 57/4, 57/5 మెమోలను అమలు పరిచేలా చేస్తానని తెలిపారు. మోడల్‌స్కూల్స్ అన్ని రకాల గురుకులాల వారికి 010 పద్దు వేతనాలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పే స్కేల్, ఆరోగ్యకార్డుల మంజూరికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మైనంపాటి శ్రవణ్‌రెడ్డి, నాయకులు గాదె లింగస్వామి, సైదిరెడ్డి, అజీజ్, మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సరిత, రమ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను పంచుతున్న టీజాక్ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పదిలో నూరు శాతం

ఫలితాలకు కృషి

యాదగిరి, ఎంఈవో, గుర్రంపోడు



మండలంలో పదో తరగతిలో నూరు శాతం ఫలితాల కోసం కృషి చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి నోముల యాదగిరి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి, గుర్రంపోడు)

ఆంధ్రజ్యోతి: మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు ఎన్ని?

ఎంఈవో: మండలంలో 36 ప్రాథమిక పాఠశాలలు, అయిదు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక మోడల్ స్కూల్ ఉంది.

ఆంధ్రజ్యోతి: పదవ తరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య ఎంత? ఫలితాల కోసం ఎలా కృషి చేస్తున్నారు?

ఎంఈవో: మండలవ్యాప్తంగా 340 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షకు హాజరవుతున్నారు. పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం సమయంలో రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్నం భోజనం బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయా?

ఎంఈవో: డిసెంబరు వరకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి బిల్లులన్నీ చెల్లించాం. విద్యార్థులందరికీ నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు రోజు విడిచి రోజు రాగి జావ అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో విద్యార్థుల హాజరు ఏ విధంగా నమోదు చేస్తున్నారు?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా ఎక్కువగా ఉన్నట్లు చూపించకుండా ప్రభుత్వం ఫేస్ రికగ్నైజింగ్ సిస్టమ్ ద్వారా యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నాం. బోగస్ విద్యార్థులు ఉండే వీలు లేదు.

ఆంధ్రజ్యోతి: అపార్ వల్ల లాభాలేంటి?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ప్రతి పాఠశాలకు తిరిగి కాలయాపన చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం అపార్‌ను ప్రవేశపెట్టింది. పాఠశాలలో చదివే విద్యార్థుల పూర్తి వివరాలను అపార్‌లో నమోదు చేస్తున్నాం. విద్యార్థి ఎప్పుడైనా, ఎక్కడైనా తమ స్టడీ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఎలా జరుగుతున్నాయి?

ఎంఈవో: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జరిపేందుకు బడ్జెట్ విడుదలైంది. ఆయా పాఠశాలలో పనులు జరుగుతూనే ఉన్నాయి.

మాదిగ జాతి ఆణిముత్యం మందకృష్ణ

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



మిర్యాలగూడలో మంద కృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదిగజాతి మహాత్ముడు, ఆణిముత్యం మందకృష్ణమాదిగ అని ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్‌కమిటీ సభ్యుడు ధైద సత్యం, ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మచ్చ ఏడుకొండలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం మందకృష్ణను పద్మ పురస్కారంతో సత్కరించినందుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మంద కృష్ణ ఫ్లెక్సీకీ క్షీరాభిషేకం చేశారు. అనంతరం పెద్దఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. మంద కృష్ణ మాదిగ 30ఏళ్ల పాటు ఏబీసీడీ వర్గీకరణకు అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలోవీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్‌ఖాన్, వైహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య, దళిత మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎడ్ల రమేష్, నాయకులు రేపూరి వీరప్రతాప్, ఆకీరపు రాములు, ధైద కిరణ్, ధైద రవికుమార్, సురేందర్, శంకర్, గోపి, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వీరమళ్ల పరమేష్, పోతెం కరుణాకర్, ఘనపురం శంకర్, మద్దిమడుగు సాయి, గండు సుధాకర్, అచ్యుత్‌కుమార్, పెద్దులు, సదానందం, ఫ్రాన్సిస్, వెంకటయ్య, నాగరాజు, ముత్యమయ్య, మార్కయ్య, సతీష్, రవి పాల్గొన్నారు.

సాగర్ వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నాగార్జునసాగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం పైలాన్ కాలనీలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.రాజా, జనరల్ సెక్రటరీగా జి.శంకరయ్య ఎన్నియ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, నర్సింహారావు, రవి, చంద్రకళ, నూర్జహాన్, కృష్ణకుమారి, అజ్మతుల్ల, సత్యనారాయణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అమలు చేయాలి: బీజేపీ

చింతపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అమలుచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ డిమాండ్ చేశారు. చింతపల్లి మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామసభల నేరుతో ప్రజలను మభ్యపెట్టి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : ఆర్డీవో

● కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో

కొండమల్లేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం తగదని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో రమణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు రైతులు రిజిస్ట్రేషన్ నిమిత్తం కార్యాలయానికి రాగా ఎంతకి తహసీల్దార్ రాకపోవడంతో విసుగు చెందిన పలువురు ఆర్డీవోకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఈ మేరకు స్పందించిన ఆర్డీవో ఆకస్మికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేయగా తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా మాట్లాడి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహించడంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే నెల రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయంపై అధికారులు, సిబ్బంది పనితీరుపై విమర్శలు రావడం, తాజాగా ఆర్డీవో ఆకస్మికంగా కార్యాలయాన్ని తనిఖీ చేయడంతో తహసీల్దార్ పనితీరుపై మండలంలో చర్చనీయాంశంగా మారింది.


ఓపీఎస్‌ను అమలుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని కోరుతూ సోమవారం టీపీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం యూపీఎస్ (ఏకీకృత పింఛన్ స్కీం) అమలు చేయనున్న సందర్భంగా ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అశోక్‌కుమార్, యాదయ్య, ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి, వెంకట్‌రెడ్డి, రవికుమార్, విమల, బాలాజీ, అంజయ్య, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయక్

పెద్దవూర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జావత్ రవినాయక్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం నల్లగొండలో నిర్వహించే రైతు మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రమావత్ శ్రీకర్‌నాయక్, రమావత్ హరినాయక్, శంకర్, కొండలు, రాజశేఖర్, అశోక్, వెంకన్న, మంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

దామరచర్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ బానోతు జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. పరిపాలన విభాగంలో ఉత్తమ పనితీరు కనబరిచి కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తహసీల్దార్ బానోతు జవహర్‌లాల్ నాయక్‌తో పాటు ఆర్ఐ సతీష్‌ను సోమవారం తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధీరావత్ శ్రీనునాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లావూరి రవి, ధీరావత్ మున్నానాయక్, జగన్, రమేష్‌నాయక్, దాయిద్ తదితరులు పాల్గొన్నారు.